మియాపూర్‌లో చిరుత సంచారం!

మియాపూర్ , అక్టోబర్ 18: మియాపూర్‌లో చిరుత సంచారం కలకలం రేపుతుంది. మెట్రో స్టేషన్ వెనక పార్కింగ్ నుంచి తండా వైపు చిరుత పులి సంచరించినట్లు స్థానికులు మియాపూర్ పోలీసులు, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీ అధికారులు రంగంలోకి దిగి గాలింపును చేపడుతున్నారు. ఎటువంటి అటవీ ప్రాంతం కాకపోయినా పులి ఎక్కడి నుంచి ఇక్కడకు వచ్చిందనే సందేహాలు నెలకొంటున్నాయి. పులి సంచారాన్ని పక్కాగా గుర్తించటంతో స్థానికంగా ప్రజలలో ఆందోళన నెలకొన్నది. అయితే, జనారణ్యంలోకి పులి ఎలా వచ్చిందన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ఉచిత శిక్షణ.. ఉపాధి కల్పన

అంబర్‌పేట, అక్టోబర్ 18: నిరుద్యోగ యువతకు పలు అంశాలలో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నట్లు 'యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్' ప్రాజెక్టు మేనేజర్ షేక్ అశ్వక్ తెలిపారు. ఎక్సెల్ ఫర్ డాటా అనాలసిస్, ఎం.ఎస్ ఆఫీస్, ట్యాలీ ఈఆర్‌పీ, డిజిటల్ మార్కెటింగ్, ఐటీ/ ఐటీఈఎస్, కేరీర్ గైడెన్స్, లైఫ్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్ వంటి వాటిలో 45 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చి తదనంతరం ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. పది, ఇంటర్, డిగ్రీ పాస్/ ఫెయిల్ అయినవారు అర్హులన్నారు. అంబర్‌పేట ప్రేమ్‌నగర్ గ్రీన్‌ల్యాండ్ చౌరస్తాలో గల కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు కార్యాలయం ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు సెల్‌ఫోన్ నం. 73863 47792, 95818 00270, 78428 53053లలో సంప్రదించాలని కోరారు.

గురుకులంలో అతిథి ఉపాధ్యాయులకు దరఖాస్తులు

ఎర్రగడ్డ, అక్టోబర్ 18: బోరబండలోని తెలంగాణ రాష్ట్ర బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో అతిథి ఉపాధ్యాయ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. టీజీటీ తెలుగు, టీజీటీ సంస్కృతం, పీజీటీ ఇంగ్లిష్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు. పీజీ, బీఈడీతో పాటు ఇతర కో కర్యులర్ యాక్టివిటీస్ అర్హతలున్న అభ్యర్థులు ఫోన్ నం. 73309 08473, 96182 49353లలో సంప్రదించి దరఖాస్తు ఫారాలను పొందటంతో పాటు ఇతర వివరాల గురించి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

మూసీ నదిపై రచనలకు ఆహ్వానం

కాచిగూడ, అక్టోబర్ 18: మానవ మనుగడ, నాగరికతలకు మూలం నదులేనని, మూసీ నదిపై 'చంద్రికా గ్రంథ మండలి' పుస్తకాన్ని వెలువరించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ విజయ భాస్కర్ అన్నారు. కాచిగూడలో కార్యదర్శి డాక్టర్ వేముల నారాయణతో కలిసి డాక్టర్ విజయ భాస్కర్ శుక్రవారం మాట్లాడారు. మానవ మనుగడకు అత్యవసరమైన గాలి అనంతరం, నీరు ప్రధానమైనదని ఆయన పేర్కొన్నారు. మూసీ నదిపై విలువైన కవిత, కథ, పద్యం, గేయం ఏదైనా సాహిత్య ప్రక్రియలో రాసి ఈ నెల 30వ తేదీలోపు cgmts2017 @gmail.comకు పంపాలని విజ్ఞప్తి చేశారు.

పుట్టినరోజు శుభాకాంక్షలు

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ పాటి మీది జగన్మోహన్ రావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తన బర్త్ డే సందర్భంగా కేసీఆర్ నుంచి జగన్ ఆశీస్సులు పొందారు.

– సిటీబ్యూరో, అక్టోబర్ 18(నమస్తే తెలంగాణ);

సామాజిక బాధ్యతలో కంపెనీ సెక్రటరీలే కీలకం

16వ దక్షిణ భారత ప్రాంతీయ సదస్సులో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సదస్సును సంస్థ ప్రతినిధులతో కలిసి ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

అమీర్‌పేట్, అక్టోబర్ 18: సామాజిక బాధ్యతను పెంపొందించడంలో కంపెనీల సెక్రటరీలు కీలక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. 'ఇండ లైన్స్ ఆఫ్ ఇంటెలిజెన్స్' అనే అంశంపై శుక్రవారం బేగంపేట్‌లోని సెస్ ఆడిటోరియంలో రెండు రోజుల పాటు జరిగే ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీల 16వ దక్షిణ భారత ప్రాంతీయ సదస్సును గవర్నర్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. కంపెనీ సెక్రటరీలు నేడు ఇన్‌సాల్వెన్సీ, మధ్యవర్తిత్వం, వాల్యుయేషన్, ఫోరెన్సిక్ ఆడిట్, రిస్క్ మేనేజ్‌మెంట్ సహా అనేకంగా అభివృద్ధి చెందుతున్న ఇతర రంగాల్లో కీలకంగా వ్యవహరిస్తుండటం విశేషమన్నారు. కార్యక్రమంలో ఐసీఏఐ జాతీయ అధ్యక్షులు బి.నర్సింహన్ పాల్గొన్నారు. సెక్రటరీల పరీక్షలో మొదటి ప్రయత్నంలోనే అన్ని పేపర్లలో ఉత్తీర్ణత సాధించిన కృష్ణ అగర్వాల్‌కు మదినీడి రామకృష్ణ, సుభద్ర స్మారక అవార్డు తో పాటు దివంగత అహల్య పుట్టి స్మారక అవార్డులను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అందజేశారు.

మర్యాద పూర్వక కలయిక

జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ *– సిటీబ్యూరో, అక్టోబరు 18(నమస్తే తెలంగాణ);*

రోడ్లెక్కిన విద్యార్థులు

- ప్రభుత్వం, పాలనా తీరును ఎండగట్టిన విద్యార్థి లోకం
- ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు ఏమయ్యాయి
- ఎస్సార్ నగర్, పీర్జాదిగూడ, రామంతాపూర్‌లలో నిరసన ర్యాలీలు
- నగరంలో పలు చోట్ల అఖిల భారత విద్యార్థుల రాస్తారోకోలు, ధర్నా
- కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మల దహనం

రామంతాపూర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

పభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న ఏబీవీపీ విద్యార్థి నేతలు

అమీర్‌పేపట్, అక్టోబర్ 18: పెండింగులో ఉన్న స్కాలర్‌షిప్పులు, ఫీజుల రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కూకట్‌పల్లి విభాగ్ సికింద్రాబాద్ జిల్లా ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎస్సార్ నగర్ ఉమేష్ చంద్ర చౌరస్తాలో విద్యార్థులు పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. ఈ ధర్నాలో పాల్గొన్న ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.7,500 కోట్ల స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్‌మెంట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ బాలు మాట్లాడుతూ తెలంగాణలో పాలకులు ఉన్నారా? ప్రజల జీవన ప్రమాణాలు ఎందుకు ఇట్లా అథపాతాళంలోకి వెళ్తున్నాయంటూ విద్యార్థి లోకం పెద్ద ఎత్తున విమర్శిస్తోంది. తెలంగాణకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం రాష్ట్రంలో విద్యారంగం పతనానికి ప్రధాన కారణమవుతోందని, విద్యా వ్యవస్థపై, పాలనా యంత్రాంగంపై అవగాహన లేకపోవడంతో ప్రజలు నానా ఇక్కట్లకు గురవుతున్నారని పలువురు విద్యార్థులు గొంతెత్తి రోడ్ల మీదకు వచ్చి నినదించారు. బడ్జెట్‌లో అతి తక్కువగా కేవలం 6.5 శాతం నిధులను మాత్రమే విద్యా రంగానికి కేటాయించడాన్ని చూస్తుంటే ఈ ప్రభుత్వానికి విద్య పట్ల ఎంతటి చిత్తశుద్ధి ఉందో తెలుస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా బాధ్యతలు నిర్వహిస్తున్న విద్యారంగం పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టుగా మారిందని విమర్శించారు. రీయింబర్స్‌మెంట్ ఆధారంగా రాష్ట్రంలో 15 లక్షల మంది విద్యార్థులు తమ విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఉచితాలకు కాకుండా విద్యార్థులకు బాసటగా నిలిచి తమ శ్రేయస్సుకు పాటుపడాలని సూచించారు. ధర్నాకు దిగిన విద్యార్థి నాయకులు నందు, శ్రీరామ్, వంశీ, విజయ్, నరేష్, ఉదయ్, కార్తీక్, మోహన్, పవన్ తదితరులను ఎస్సార్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు.

ఎస్సార్‌నగర్‌లో ప్రధాన రహదారిపై ఏబీవీపీ నిరసన ప్రదర్శన

ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం

రామంతాపూర్: ఏబీవీపీ ఆధ్వర్యంలో రామంతాపూర్ ప్రధాన రహదారిలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. నల్ల జెండాలతో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి మహేంద్ర, వరుణ్, సాగర్, శివ, శశి, అఖిల్, ప్రవీణ్, భాను పాల్గొన్నారు.

విద్యార్థి వ్యతిరేకతతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు..

పీర్జాదిగూడ: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఉప్పల్ శాఖ ఆధ్వర్యంలో పీర్జాదిగూడ కెనరానగర్ బస్టాప్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం, ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ఏబీవీపీ కార్యవర్గ సభ్యుడు కార్తీక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్నా రూ.7500 కోట్ల స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా పేద, బలహీన వర్గాల విద్యార్థులను విద్యకు దూరం చేయాలన్న దురుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ఈ ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలతో ముందుకు వెళ్తుందన్నారు.

నవంబర్ 17, 18వ తేదీల్లో గ్రూప్-2, 3 పరీక్షలు

'మేడ్చల్'లో ఏడు స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు

కాన్ఫరెన్స్‌లో డీఆర్వో హరిప్రియ, చిత్రంలో మరొక అధికారి

మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 18: నవంబర్ 17, 18వ తేదీల్లో నిర్వహించే గ్రూప్-3 పరీక్షలకు జిల్లాలో ఏడు స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్ - 2, 3 పరీక్షలపై సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, టీజీపీఎస్‌సీ చైర్మన్ మహేందర్ రెడ్డి, సభ్యులు తన కార్యాలయం నుంచి శుక్రవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మేడ్చల్ కలెక్టరేట్ నుంచి డీఆర్ఓ హాజరయ్యారు. జిల్లాలో 118 పరీక్షా కేంద్రాలలో 71,356 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనల మేరకు పరీక్షలు నిర్వహిస్తామని డీఆర్వో వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓయూ వీసీగా ప్రొ. మొలుగారం కుమార్

ప్రొఫెసర్ ఎం. కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 18: ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ మొలుగారం కుమార్ నియమితులయ్యారు. ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఆయన సీనియర్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఆయన సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ హెడ్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్, టెక్విప్ మోడల్ ఆఫీసర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్, ఓయూ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, టీఎస్ పీజీఈసెట్ కన్వీనర్, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ తదితర బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆయన రీజనల్ సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ (ఆర్‌క్యూస్) డైరెక్టర్‌గా సేవలందిస్తున్నారు. ఓయూ నుంచి ఇంజినీరింగ్‌లో డిగ్రీ, జేఎన్‌టీయూ నుంచి పీజీ పూర్తి చేసిన ఆయన ప్రతిష్టాత్మక బాంబే ఐఐటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఓయూలో 1997లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరిన ఆయన 2010లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. ఇప్పటివరకు వివిధ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో వందకు పైగా పరిశోధనా పత్రాలను ఆయన ప్రచురించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఈ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజినీరింగ్ కోర్సును ప్రారంభించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

మెట్రోతో జట్టు కట్టిన యాత్రి యాప్

మన యాత్రి యాప్‌తో మెట్రో రైలు భాగస్వామ్యం లాస్ట్ మైల్ కనెక్టివిటీ సేవలందించనున్న యాప్

సిటీబ్యూరో, అక్టోబర్ 18(నమస్తే తెలంగాణ): మెట్రోతో మన యాత్రి యాప్ జట్టు కట్టింది. నగరంలోని 57 మెట్రో స్టేషన్ల చుట్టు పక్కల ప్రాంతాల నుంచి మెట్రో ప్రయాణికులు చేరుకునేలా మన యాత్రి ఓపెన్ మొబిలిటీ యాప్ సేవలను అందించనుంది. కారు, ఆటో రిక్షాల ద్వారా తమ నివాసాలు, కార్యాలయాల నుంచి మెట్రో స్టేషన్లకు చేరుకునేందుకు మన యాత్రి యాప్‌లో బుక్ చేసుకుంటే వాహనాలు అందుబాటులో ఉండనున్నాయి. టీ హబ్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మన యాత్రి ఓపెన్ మొబిలిటీ యాప్ ఎల్ అండ్ టీ మెట్రో హైదరాబాద్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో అత్యంత కీలకమైన లాస్ట్ మైల్ కనెక్టివిటీలో భాగంగా ఈ ఒప్పందం చేసుకున్నారు.

మెట్రో రైల్ వ్యూహాత్మకంగా ముందుకు..: ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

నగర ప్రజల రవాణా అవసరాలను తీర్చడంలో మెట్రో రైలు సంస్థ వ్యూహాత్మకంగా ముందుకు వెళుతోంది. నిత్యం లక్షలాది మంది ప్రయాణం చేస్తున్న మెట్రో రైలులో లాస్ట్ కనెక్టివిటీలో భాగంగా మన యాత్రి యాప్ నుంచి కారు, ఆటోలను బుకింగ్ చేసుకోవడం ద్వారా సులభంగా మెట్రో స్టేషన్లకు చేరుకోవచ్చు.

మరింతగా లాస్ట్ మైల్ కనెక్టివిటీ: ఎల్ అండ్ టీ మెట్రో సీఈఓ, ఎండీ కేవీబీ రెడ్డి

మన యాత్రితో భాగస్వామ్యం ద్వారా మెట్రో ప్రయాణికుల కనెక్టివిటీ మరింత మెరుగుపడుతుంది. మెట్రో ప్రయాణికుల అవసరాలను గుర్తించి, వాటిని సమకూర్చేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఎల్ అండ్ టీ, మెట్రో రైలు సంస్థతో కలిసి పనిచేయడం ద్వారా మన యాత్రి యాప్ సేవలు లక్షలాది మంది నగరవాసుల ప్రయాణాన్ని సులభం చేస్తుంది.

రాయితీతో కూడిన ధర: మన యాత్రి కో ఫౌండర్, సీఈఓ మజిగన్ సెల్వన్

మన యాత్రి యాప్‌లో ఆటోను బుక్ చేసుకుంటే రాయితీతో కూడిన ధర రూ.40 నుంచి ప్రారంభమవుతుందని, సమీప మెట్రో స్టేషన్లకు సులభంగా, వేగంగా చేరుకోవచ్చు.

నిరుపేద వైద్య విద్యార్థులకు బీఎల్ ఆర్ ఆర్థిక సాయం

అభినందించిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు

సమాజంలో అత్యంత వెనుకబడిన వడ్డెర కులానికి చెందిన నిరుపేద ఎంబీబీఎస్ విద్యార్థులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అండగా నిలిచారు. చిలుకా నగర్ డివిజన్‌కు చెందిన వీరయ్య కుమార్తె ఒర్సు నందిని, కాప్రా డివిజన్‌కు చెందిన కుంచం నర్సయ్య కుమారుడు గీతా కృష్ణ, మల్లాపూర్ డివిజన్, ఎస్వీనగర్‌కు చెందిన శీతల విజయ్ కుమార్ కుమార్తె అఖిల, అలాగే వస్పతి శ్రీనివాస్ కుమారుడు జీవన్ కుమార్ ఎంబీబీఎస్‌లో ఇటీవల సీటు పొందారు. వీరు ఫీజు కట్టలేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే, బీఎల్ఆర్ ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. రాష్ట్ర మాజీ మంత్రి టి.హరీశ్ రావు వైద్య విద్యార్థులకు ఆర్థిక సహాయం చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, సాయిజెన్ శేఖర్, గంధం నాగేశ్వర్ రావు, వడ్డెర సంఘం నాయకులు బోదాసు లక్ష్మీనారాయణ, బోదాసు నరేశ్, ఒర్సు పెండయ్య పాల్గొన్నారు.

– కాప్రా/ మల్లాపూర్, అక్టోబర్ 18;

ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ కన్నుమూత

ప్రొ. వి.సత్యనారాయణ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 18: ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ వడ్డేపల్లి సత్యనారాయణ(60) గుండెపోటుతో కన్నుమూశారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆకస్మికంగా గుండెపోటుకు గురై మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఓయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 1997లో చేరారు. ఆయన గతంలో ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం హెడ్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, కళాశాల ప్రిన్సిపాల్, ఓయూ ఫిజికల్ డైరెక్టర్, ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. టీఎస్ పీఈసెట్‌కు 2019 నుంచి 2022 వరకు కన్వీనర్‌గా వ్యవహరించారు. ఆయన మృతి పట్ల పాలమూరు యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్, ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేశ్ కుమార్, తదితరులు సంతాపం తెలిపారు. ఆయన స్వగ్రామమైన వరంగల్ జిల్లా వడ్డేపల్లిలో శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

అట్టుడికిన అశోక్‌నగర్

గ్రూప్-1 ఉద్యోగార్థులపై విరిగిన పోలీసు లాఠీ

జీవో 29ని రద్దు చేయాలని, గ్రూప్ -1 పరీక్షలను వాయిదా వేయాలని ఉద్యోగార్థులు, విద్యార్థులు శుక్రవారం అశోక్ నగర్‌లో పెద్ద ఎత్తున రాస్తారోకో చేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ముషీరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ నుంచి అశోక్ నగర్, ధర్నా చౌక్ వరకు విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానికంగా ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు భారీ స్థాయిలో అశోక్‌నగర్‌ను మోహరించారు. సామరస్యంగా ఆందోళన చేపడుతున్న విద్యార్థులపై ఇష్టారాజ్యంగా పోలీసులు లాఠీ చార్జీతో విరుచుకుపడ్డారు. మహిళలు అని చూడకుండా పోలీసులు బీభత్సం సృష్టించారు. పలువురు విద్యార్థులను ఈడ్చుకువెళ్లి వ్యాన్లు, వాహనాలను ఎక్కించారు. పలువురు ఆందోళనకారులను అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు.

కాలుష్య నియంత్రణ మండలిని ప్రక్షాళన చేయాలి

- ఆ విభాగంలో అవినీతి అక్రమాలపై విచారణ జరుపండి
- ఎన్విరాన్‌మెంట్ సోషల్ వర్కర్ సంస్థ అధ్యక్షులు పీఎల్ఎన్ రావు

సమావేశంలో మాట్లాడుతున్న పీఎల్ఎన్ రావు

ఖైరతాబాద్, అక్టోబర్ 18: రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో చేపడుతున్న ప్రాజెక్టుకు ముందు కాలుష్య నియంత్రణ మండలిని ప్రక్షాళన చేయాలని ఎన్విరాన్‌మెంట్ సోషల్ వర్కర్ సంస్థ అధ్యక్షులు పీఎల్ఎన్ రావు అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో న్యాయవాది రాజేశ్ కుమార్, ఆరెగూడెం మాజీ సర్పంచ్ మల్లేశ్ యాదవ్, నల్గొండ జిల్లా పెద్ద దేవులపల్లి గ్రామానికి చెందిన రైతు ఠాకూర్ రాజారాం సింగ్, కాలుష్య వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షులు లింగారెడ్డితో కలిసి మాట్లాడారు. మూసీ ప్రక్షాళన కంటే ముందు అది కాలుష్యంగా ఎందుకు మారిందన్న దానిపై విచారణ జరిపించాలన్నారు. పటాన్ చెరువు పారిశ్రామికవాడతో పాటు జీడిమెట్ల పారిశ్రామికవాడలోని పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను పూర్తి స్థాయిలో శుద్ధి చేయకుండా నేరుగా నాలాల ద్వారా మూసీలోకి వదులుతున్నారని, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రజలు గత 20 ఏండ్లుగా భూగర్భ జలాలు కలుషితమై, పంటలు పండక తీవ్రంగా నష్టపోతున్నారని, మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి చోద్యం చూసినందు వల్లే మూసీ మొత్తం కాలుష్య కుహరంగా మారిందన్నారు. పటాన్ చెరువు, బీహెచ్ఈఎల్, మల్లాపూర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో వివిధ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను పూర్తి స్థాయిలో శుద్ధి చేయకపోవడం, వాటిపై పీసీబీ పర్యవేక్షణ కొరవడి మూసీ కలుషితమైందన్నారు. వ్యర్థాల నియంత్రణ, నివారణలో ఆ శాఖ పూర్తిగా విఫలమైందని, అవినీతి అక్రమాలతో ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి బాధ్యులైన పీసీబీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.